అక్రమార్కులకు అడ్డా..

- రోజుకో డబ్బా వెలుస్తున్నా పట్టించుకోని అధికారులు
- ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్న ప్రైవేట్ వాహనాలు

చింతల్: చింతల్ బస్ స్టాప్ అక్రమార్కులకు అడ్డాగా మరిందని ప్రయాణికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. బస్టాప్‌ల నిర్వహణ, వాటిపై నిఘా లోపించడంతో కొందరు బడా బాబులకు వసూళ్ల కేంద్రంగా మారింది. పట్టించుకోవాల్సిన జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బి, టీఎస్ఆర్టీసీ యంత్రాంగం చేతులెత్తేయడంతో వారు జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. బాలానగర్–నర్సాపూర్ రాష్ట్ర రహదారిలోని చింతల్ బస్టాప్ పలు ప్రాంతాలకు ప్రధాన కేంద్రంగా ఉంది. కుత్బుల్లాపూర్‌లోని ఓ భాగం ప్రజలు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ బస్టాప్‌ను ఆనుకుని కొందరు డబ్బాలు, వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చింతల్ బస్టాప్‌లో కనీస సదుపాయాలు కరువు




చింతల్ ఆర్టీసీ బస్టాప్ సమీపంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

కబ్జాల పర్వం ఇలా....

హెచ్ఎంటి గోడకు ఆనుకుని ఉన్న చింతల్ బస్టాప్ కబ్జాకు గురవుతోంది. ఓవైపు జీహెచ్ఎంసీ మరుగుదొడ్డి పక్కనే షీ టాయిలెట్, ఆ పక్కనే చేపల మార్కెట్, దానిని ఆనుకునే మటన్ దుకాణం.. ఇలా చెప్పుకుంటూ పోతే పలు వ్యాపార సముదాయాలు ఏర్పాటయ్యాయి. బస్టాప్‌ను ఆనుకుని రోజుకోక డబ్బా వెలుస్తోంది. నిత్యం రద్దీగా ఉండే బస్టాప్ ఈ కొత్త దుకాణాల రాకతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రెండు మూడు బస్సులు ఒకేసారి వస్తుండటంతో తికమక పడి ఒక బస్సు ఎక్కాల్సింది పోయి మరో బస్సు ఎక్కుతూ గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు జీడిమెట్ల, బొంతపల్లి తదితర పారిశ్రామిక వాడలకు వెళ్లాల్సిన కార్మికులకు సంబంధించి ఇదే బస్టాప్‌లో సదరు కంపెనీలకు చెందిన బస్సులు నిలుపుతుండటంతో బస్టాప్ మరింత రద్దీగా ఉంటుంది. పలు పరిశ్రమలకు చెందిన

ఆర్టీసీ ఆదాయానికి గండి..

ఐడీపీఎల్ చౌరస్తా, చింతల్ బస్టాప్, గాజుల రామారం చౌరస్తా, షాపూర్ నగర్ కూరగాయల మార్కెట్ తదితర బస్టాప్‌ల వద్ద ప్రైవేట్ బస్సులు నిలుపుతూ ఆయా కంపెనీలకు చెందిన సిబ్బందిని తీసుకువెళ్లే క్రమంలో ఇతర ప్రయాణికులను సైతం సదరు ప్రైవేట్ బస్సు డ్రైవర్లు ఎక్కించుకోవడంతో ఆర్టీసీ ఆదాయానికి భారీగానే గండి పడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ కారణంగా ఆర్టీసీ బస్సుల్లో వెళ్లలేని ప్రయాణికులు ప్రైవేటు కంపెనీలకు చెందిన బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు బస్టాప్‌ల వద్ద ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ దుకాణాలను తొలగించాలని, ప్రైవేట్ బస్సులకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రైవేట్ బస్సులను ఇతర ప్రాంతాల్లో నిలపాల్సిందిగా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అప్పుడప్పుడు పికెట్ ఏర్పాటు చేసినా అవి మూన్నాళ్ల ముచ్చటగానే మారుతోంది.

ముఖ్యమంత్రి రేవంత్ నిర్ణయాలు అభినందనీయం

మోతీనగర్: కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, ప్రియాంకా గాంధీ, రాహుల్ గాంధీ నేతృత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా మోతీనగర్‌లో సీనియర్ నాయకుడు గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన విజయోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం పీజేఆర్, అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసి బస్సు ఉచితంగా ప్రయాణం సందర్భంగా సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు పథకాలని అమల్లోకి తీసుకువచ్చారన్నారు.

సందడిగా శిల్పారామం

మాదాపూర్: ఆదివారం సెలవురోజు కావడంతో సందర్శకులు శిల్పారామాన్ని అధిక సంఖ్యలో సందర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ప్రతి రోజు 2వేల మంది సందర్శించే వారని, సెలవు రోజుల్లో, శని, ఆదివారాలలో 6వేల నుండి 8వేల వరకు వస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీఓ శ్యామ్ ప్రకాశ్ తదితరులు

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని మల్కాజ్‌గిరి–మేడ్చల్ జిల్లా ఆర్టీఓ శ్యామ్ ప్రకాశ్ అన్నారు. ఆదివారం షాపూర్ నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు సంధ్యారాణి, నవనీతలతో కలిసి ఆయన పలువురికి ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రకాశ్ మాట్లాడుతూ అర్హులైన అందరికి ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తామని, రూ.10 లక్షల వరకు ఆరోగ్య బీమా అందుతుందన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు సర్వీసులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా..



గురుమూర్తినగర్‌లోని బన్నీరాధా టెంట్ హౌస్ గల్లీలో పరిస్థితి ఇలా..

రంగారెడ్డినగర్: సర్కిల్ అధికారుల పర్యవేక్షణ లోపంతో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది.. ప్రధాన రోడ్లపై దృష్టి పెడుతున్న అధికారులు అంతర్గత రోడ్లలో పారిశుద్ధ్య నిర్వహణను గాలికొదిలేస్తున్నారు.. అసలే వైరల్ ఫీవర్లు, విషజ్వరాలతో ప్రజలు ఆస్పత్రులు చుట్టూ తిరుగుతున్నా సదరు విభాగం అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గురుమూర్తినగర్‌లోని బన్నీ రాధా టెంట్ హౌస్ గల్లీలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఈ గల్లీలో చెత్త పేరుకుపోయి దుర్గంధభరితంగా మారింది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజారోగ్యంపై దృష్టి సారించి పరిశుభ్రతను పెంపొందించాలని కోరుతున్నారు.

అంబరాన్నంటిన 'జష్న్' సంబరాలు





గేయాలు ఆలపిస్తున్న చిన్నారులు..

నిజాంపేట్: బాచుపల్లిలోని కెన్నడీ హై గ్లోబెల్ స్కూల్ 19వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ప్రీప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులు నిర్వహించిన 'జష్న్' సంబరాలు అంబరానంటాయి.. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు, గేయాలాపనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల ఛైర్మన్ జమలారెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నామని, విద్యార్థులు కష్ట సుఖాలను ఎదుర్కొనేలా మానసిక స్థైర్యాన్ని అందించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. ఇంటర్నేషనల్ స్పీకర్ ప్రొఫెసర్ కవిత మాట్లాడుతూ విద్యార్థుల్లో నిజాయితీ, కలుపుగోలుతనం, కష్టపడే తత్వాన్ని పెంపొందిస్తే ఏ సమస్యనైనా ఎదుర్కొంటారన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుధాకర్, మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి భట్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం 13వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపా కటాక్షాలు నియోజవర్గ ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు హన్మంతరెడ్డి పేర్కొన్నారు.

ప్రతిభకు గుర్తింపు



సాహితికి సర్టిఫికేట్ అందజేస్తున్న బూమ్స్ అకాడమీ నిర్వాహకుడు మాస్టర్ కృష్ణ

కుత్బుల్లాపూర్: విద్యార్థులు చదువు మీద దృష్టి కేంద్రీకరించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగడానికి, జీవితంలో ఉన్నత విలువలను పెంపొందించుకునేందుకు అవసరమైన సేవలు అందిస్తున్నామని బూమ్స్ అకాడమీ నిర్వాహకులు మాస్టర్ కృష్ణ అన్నారు. గత ఆగస్టు 26న నిర్వహించిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ లైవ్ కార్యక్రమంలో బూమ్స్ అకాడమీకి చెందిన విద్యార్థిని రాంగారి సాహితి ప్రతిభ కనబరిచి వివిధ విభాగాల్లో పతకాలు సాధించింది. అందకు సంబంధించిన సర్టిఫికేట్లను ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాస్టర్ కృష్ణ విద్యార్థిని సాహితికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ సాహితి భవిష్యత్‌లో మరిన్ని రికార్డులు సొంతం చేసుకుని అకాడమీకి, తల్లిదండ్రులకు పేరు తేవాలని అభిలాషించారు.

ఘనంగా బాలోత్సవ్

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం ప్రగతినగర్‌కు చెందిన ప్రగతి బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాలోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రగతి సెంట్రల్ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 36 పాఠశాలలకు చెందిన 1600 మంది విద్యార్థులు 13 రకాల ఈవెంట్లలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా ప్రగతి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ఎస్.మాధవి, సుందరయ్య భవన్ నిర్వహణ కన్వీనర్ సిహెచ్ మల్లయ్య చారి, పీపుల్స్ ట్రస్ట్ సమన్వయకర్త సిహెచ్ కృష్ణారావు మాట్లాడుతూ బాల బాలికల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించటానికి ఒక వేదికగా ప్రగతి విద్యానికేతన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల మనోవికాసానికి , ఉల్లాసానికి, ఉత్సాహానికి, వారిలో దాగి ఉన్న ప్రతిభను వారు తెలుసుకునే విధంగా భవిష్యత్తులో నైపుణ్యాన్ని పెంచుకునేందుకు బాలోత్సవ్ అవకాశం కల్పించిందన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ అధినేత డి.దయాకర్‌రెడ్డి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీరాములు, వెంకట రామయ్య, సుజాత, కాలనీ ఫౌండర్లు సోమిరెడ్డి, సూర్యప్రకాష్, బాల వెంకటేశ్వరరావు, శంకర్ రావు, వాలంటీర్లు చంద్రశేఖర్, బాలపీరు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



బాలోత్సవ్‌కు హాజరైన విద్యార్థులు

తప్పిపోయిన వృద్ధుడిని కుటుంబసభ్యులకు అప్పగింత



అబ్రహం..

సుభాష్‌నగర్: తప్పిపోయిన వృద్ధుడిని సూరారం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.. ఎస్ఐ నారాయణ్‌సింగ్ కథనం మేరకు.. సూరారంలోని హెటరో డ్రగ్స్ సమీపంలో ఆదివారం ఓ వృద్ధుడు తప్పిపోయి తచ్చాడుతూ కనిపించాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సూరారం పోలీసులు అతడి వివరాలు తెలుసుకున్నారు. తన పేరు అబ్రహాం అని, ఎల్లారెడ్డి తమ సొంత ఊరని చెప్పాడు. దీంతో ఎస్ఐ నారాయణసింగ్ ఆధ్వర్యంలో అతడిని బహదూర్‌పల్లిలోని ఓ ఆశ్రమంలో ఉంచి, అతని వివరాలను ఎల్లారెడ్డి పోలీసులకు పంపించారు. సమాచారం అందుకున్న అబ్రహాం కుటుంబ సభ్యులు సూరారం పోలీస్ స్టేషన్‌కు రావడంతో వారికి అతడిని అప్పగించారు.

కాంగ్రెస్ పాలనలో మహిళలకు ప్రాధాన్యం

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యం ఇస్తుందని అందులో భాగంగానే మహాలక్ష్మి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించటం పట్ల మహిళలందరు సంతోషంగా ఉన్నారన్నారు.త్వరలోనే మిగిలిన గ్యారంటీలను కూడా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజు, ఏకాంత్ గౌడ్, ధ్యూం శ్రీహరి గౌడ్, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలో ప్రతిపాదనలు శాస్త్రీయంగా ఉండాలి

రాయదుర్గం: పరిశోధనలో ఊహా ప్రతిపాదన శాస్త్రీయంగా ఉండాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ తెలుగు విభాగం అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. హెచ్‌సీయూలోని తెలుగు విభాగం కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా పిఆర్‌ఆర్ అండ్ విఎస్ ప్రభుత్వ కళాశాల తెలుగు పరిశోధన కేంద్రం, డికె ప్రభుత్వ మహిళా కళాశాల నెల్లూరు ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనా విధానం రెండు రోజుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశోధన ప్రణాళికలో ఊహ ప్రతిపాదన సూటిగా, స్పష్టంగా వివరణాత్మకంగా ఉండాలని చెప్పారు. సిద్ధాంత వ్యాస రూపకల్పన ఆకారాలు అనే అంశంపై వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య మేడిపల్లి రవికుమార్ ప్రసంగించారు. అనంతరం పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు వివరణతో తెలుగు పరిశోధన పద్ధతులపై లోతైన చర్చ సాగింది. కార్యక్రమంలో డాక్టర్ కరుణశ్రీ,, డా.పద్మప్రియ పాల్గొన్నారు.

నాడు అవే ఆధారం.. నేడు నిరుపయోగం



గిరినగర్ రోడ్డులో హ్యాండిల్ లేని చేతి పంపు..



రంగారెడ్డినగర్‌కు వెళ్లే దారిలో..



గాంధీనగర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్ పక్కన..



చెన్నారెడ్డినగర్‌లో..

రంగారెడ్డినగర్: ఒకప్పుడు ప్రజల నీటి అవసరాలను తీర్చిన చేతి పంపులు నేడు నిరుపయోగంగా మారాయి.. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు బస్తీల్లో వంద సంఖ్యలో చేతిబోరు పంపులను జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల క్రితం వరకు ఆయా ప్రాంతాల ప్రజలు వీటిపైనే ఆధారపడ్డారు. ఇటీవల ఇళ్లకు మంజీర నీటి కనెక్షన్లు రావడంతో వీటి వాడకం తగ్గింది. ఆ తర్వాత అధికారులు వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి. కొన్ని చోట్ల ఉన్నా పని చేయకపోవడం, వాటి హ్యాండిళ్లు లేకపోవడం కనిపిస్తోంది.. భవిష్యత్‌లో తాగు నీటి సరఫరాలో ఏమైనా అవాంతరాలు ఏర్పడితే బస్తీల్లో చేతి పంపులే ఆధారంగా ఉంటాయి. ఈ విషయంపై సర్కిల్, జలమండలి అధికారులు దృష్టి సారించి వాటి నిర్వహణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

పేదలకు అండగా నిలవాలి

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని మాజీ కౌన్సిలర్ మక్కాల నర్సింగ్ అన్నారు. ఆదివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట మోడల్ మార్కెట్ సమీపంలో కింగ్ ఆఫ్ కింగ్ మినిస్ట్రీ అధ్యక్షుడు డాక్టర్ అందె సుదాకర్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రగ్గులు, చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా కింగ్ ఆఫ్ కింగ్ మినిస్ట్రీ నిర్వాహకులు పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. లెప్రసీ రోగులు, వృద్ధులు, అంధులు, అనాథలకు ఏటా దుప్పట్లు, దుస్తులు అందిస్తున్నారన్నారు. ఏడాది పొడవున ఉచిత వైద్యంతో పాటు వారి ఆకలి తీర్చేందుకు చేపట్టిన సేవా కార్యక్రమాల్లో తాము పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. కింగ్ ఆఫ్ కింగ్ మినిస్ట్రీ అధ్యక్షుడు డాక్టర్ అందె సుదాకర్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అన్నారు. పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో 11ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మదర్ థెరిసా స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నారాయణగౌడ్,బాస్కర్, ఫస్టర్లు గొంగొళ్ల సునీల్, కనకం అశోక్, ప్రభుకుమార్ కింగ్ ఆఫ్ కింగ్ మినిస్ట్రీ సభ్యులు సంజీవ్, సురేష్, మనీష్, ప్రేమ్ కుమార్, మహేష్, విజయ్ పాల్గొన్నారు.

మాకూ ఉపాధి చూపండి..



జీడిమెట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం 'మహాలక్ష్మి' పేరుతో మహిళలకు ఉచితంగా ప్రవేశపెట్టిన బస్సు ప్రయాణ పథకం తమ బతుకులను అంధకారంలోకి నెట్టిందని ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఓలా, ఉబర్ యాప్‌ల నిర్వాహకుల దోపిడీతో తీవ్ర నష్టాల్లో ఉన్న తమను ప్రభుత్వం కోలుకోలేని దెబ్బతీసిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏన్నో ఏళ్లుగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న తాము ఇకపై ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కిరాయి ఆటోలను నడుపుకుని చాలీచాలని ఆదాయంతో జీవనం సాగిస్తున్న తాము ఇకపై కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు కన్నీటి పర్యంతమయ్యారు.

కుటుంబాలను పోషించుకునేదెలా..

గ్రామాల్లో ఉపాధిలేక పొట్ట చేతపట్టుకుని నగరానికి వలసవచ్చిన తమకు మహిళలు ఆటోల్లో ఎక్కకపోతే తమకు వచ్చే డబ్బులు రావని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి కిరాయిలు ఎలా కట్టాలి, పిల్లల స్కూలు ఫీజులు ఎలా చెల్లించాలని వారు ప్రశ్నిస్తున్నారు.

ఈఎంఐలు ఎలా చెల్లించాలి..

ఓలా, ఉబర్‌లు నడుపుకునే తాము ప్రతి నెల కార్లకు ఈఎంఐలు చెల్లించాల్సి ఉంటుందని, తమకు గిరాకీ దక్కకపోతే ప్రతినెల బ్యాంకు చెల్లింపులు కష్టమేనని అంటున్నారు. దీంతో కార్లను అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు.


ఆదాయం పడిపోతుంది..



సంగారెడ్డి నుండి బతుకుదెరువు కోసం కుత్బుల్లాపూర్ వచ్చి ఆటో నడుపుకుంటున్నాను. వచ్చిన అదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఇకపై మహిళలు ఆటోల్లో ఎక్కకపోతే సగం ఆదాయం పడిపోతుంది. దీంతో మేము కుటుంబాలు ఎలా పోషించుకోవాలనే ఆలోచనలో పడ్డాం. ప్రభుత్వం మా కోసం ఏదైనా సహాయం చేస్తే బాగుంటుంది.

– వెంకటేష్ (ఆటో డ్రైవర్)..

ప్రతి నెలా రూ.25 వేలు ఈఎంఐ చెల్లించాలి



నేను క్యాబ్ నడుపుకుని జీవనం సాగిస్తున్నా. ప్రతినెలా రూ.25వేల వరకు ఈఎంఐలు చెల్లించాల్సి వస్తుంది. ఓలా, ఉబర్ కిరాయిలు దొరకకపోతే మేము కుటుంబాలను పోషించుకోవడం కష్టమే. మా కోసం ప్రభుత్వం ఆలోచించి ఆర్థిక సహాయం అందజేయాలి.

– మహేష్ (క్యాబ్ డ్రైవర్)..

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



ఎమ్మెల్యే వివేకానంద్‌కు అభినందనలు తెలుపుతున్న బ్యాంక్ కాలనీ వాసులు..



ఎమ్మెల్యేను సత్కరించిన జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య మహాసభ కమిటీ సభ్యులు..

కుత్బుల్లాపూర్: అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్టలో నూతనంగా నిర్మించిన మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అన్ని కుల సంఘాలకు స్థలాన్ని కేటాయించి వారి అభ్యున్నతికి కృషి చేసామని, భవిష్యత్‌లో సైతం ప్రజాభీష్టం మేరకు పాలన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్, వెంకటేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్ రేగూరి ప్రవీణ్ కుమార్‌గుప్తా, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవస్థానం గౌరవ చైర్మన్ కాచం కైలాసం గుప్తా, అధ్యక్షుడు ఉప్పల రమేష్ గుప్తా, ఉపాధ్యక్షుడు నేతి శంకర్ గుప్త, కార్యదర్శి చిగుళ్లపల్లి లక్ష్మణరావు గుప్తా, అదనపు ప్రధాన కార్యదర్శి యెర్రం శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి మహంకాళి సురేష్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ యాద నరేందర్ గుప్తా, గంజి స్వామి గుప్తా, అంగడి సత్యనారాయణ, లక్ష్మీ నరసయ్య, శేర్విరాల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వన భోజనాలతో స్నేహ సంబంధాలు

- సూరారం డివిజన్ జీడిమెట్ల శ్రీ నల్లగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ప్రాంగణంలో జరిగిన తెలంగాణ భట్రాజు సంక్షేమ సంఘం 20వ వార్షిక, కార్తీక మాస వనభోజన వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు. కార్తీక వన భోజనాలు ఏర్పాటుతో కుటుంబాల మధ్య స్నేహ సంబంధాలు బలపడతాయన్నారు. ఈ సందర్భంగా భట్రాజు సంక్షేమ సంఘం పెద్దలు ఉడుమూడి విజయలక్ష్మి, నారాయణ రాజు, శారదల జ్ఞాపకార్థం 20 మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేశారు. భట్రాజు సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతి కంఠం పూర్ణచందర్ రాజు, సాహితీ కార్యదర్శి చక్రాల రేవతి నంద్, జిల్లా అధ్యక్షులు కూరపాటి కర్ణాకర్ రాజు, కార్యదర్శి లేవుల బట్టు కష్ణంరాజు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు రాధాకృష్ణ భట్, కార్యనిర్వాహక కార్యదర్శి కూరపాటి శ్రీరామ రాజు, ప్రచార కార్యదర్శి సరస్వతీ నరేందర్ రాజు, యువజన విభాగం అధ్యక్షులు పోరంకి శ్యామ్‌ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మూడోసారి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన వివేకానంద్‌ను బ్యాంక్ కాలనీ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. కాలనీ ప్రెసిడెంట్ వార్డ్ మెంబర్ సుధాకర్ గౌడ్, సెక్రటరీ కృష్ణగౌడ్, సర్వేశ్వరరావు, వెంకట్ రెడ్డి, మల్లేష్, మూర్తి, సుబ్బారావు, నారాయణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ, రాజేష్ ఉన్నారు.

నూతన ఎమ్మెల్యేలకు అభినందనలు

కూకట్‌పల్లి: ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలను కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించిన దానం నాగేందర్, సనత్‌నగర్ ఎమ్మెల్యేగా మూడోసారి భారీ మెజార్టీతో విజయం సాధించిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గొట్టిముక్కల తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట డివిజన్ బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

మూసాపేట: మూసాపేట డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూసాపేట డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు, స్థానిక ప్రజలు తనకు ఓట్లు వేసి గెలిపించారన్నారు. డివిజన్‌లో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవటం శుభ పరిణామమన్నారు.

ఆకట్టుకున్న 'చండాలిక'

హఫీజ్‌పేట్: చండాలిక నృత్యరూపకం అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం గచ్చిబౌలిలోని రంగ్‌భూమిలో అక్షిత సమర్పణలో నిర్వహించిన నృత్యరూపకం సందేశాత్మంగా సాగింది. రంగ్‌భూమి ఆడిటోరియం వేదికగా ప్రముఖ నృత్యకారిణి నియంత్రికరెడ్డి సారథ్యంలో తన 40 మంది శిష్యబృందం అద్భుతంగా లయబద్ధంగా చక్కని అభినయం, హావభావాలతో ఆవిష్కరించిన రూపకం ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నర్తకి సబిత భమిడిపాటి, ఆచార్య సాంబశివరావు, ప్రొఫెసర్ అరుణ భిక్కు పాల్గొన్నారు.